
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 6 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	587.70 (305.9222)	95,761	40,810
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.30 (3.52)	8,773	12,111
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.78 (43.88)	57,482	57,482

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.176 | స్కిన్‌లెస్ : రూ.200

స్వామీ.. పనులు పూర్తయ్యేనా ?

- సీఎం ఆదేశాలతో నివేదికలు రూపొందిస్తున్న ఆలయ అధికారులు
- నిధుల మంజూరుతోపాటు పనుల పురోగతిపై రేవంత్‌రెడ్డి ఆరా
- నిలిచిన మొదటిఘాట్ రోడ్డు బ్రిడ్జి, శిల్పారామం, అన్నదాన సత్రం పనులు
- ప్రారంభానికి నోచని వైటీడీఏ అతిథిగృహం
- రూ.101కోట్ల పరిహారం పెండింగ్





ఆలయ ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్

యాదగిరీశుడి క్షేత్రంలో భక్తులకు సౌకర్యాలపై ఇటీవల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై పూర్తిస్థాయి నివేదిక అందించాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆలయ పనుల పురోగతిపై ప్రత్యేకదృష్టి సారించారు. అయితే దేవాలయ కొండకింద చేపట్టాల్సిన పలు పనులు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఈ పనులు నిలిచిపోవడానికి ప్రధాన కారణం బడ్జెట్ కేటాయింపులు లేకపోవడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే దాతల సహకారంతో కొండపైన, కింద భక్తులకోసం పలు సౌకర్యాలను ఏర్పాటుచేశారు. అయితే సంవత్సరకాలంగా యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. కొండ చుట్టూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు సేకరించిన భూనిర్వాసితులు కూడా పరిహారంకోసం పడిగాపులు కాస్తున్నారు. కొండ కింద సుందరీకరణ పనుల్లో భాగంగా ఆరులేన్ల రహదారులు, రెండు ఫ్లైఓవర్లు, నాలుగు ప్రధాన సర్కిళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం వైటీడీఏకు మొత్తం రూ.143కోట్లు కేటాయించింది. రహదారుల సుందరీకరణ పనులతోపాటు ఆలయానికి ఉత్తరభాగంలోని ప్రెసిడెన్షియల్ సూట్ వైపు గల రెండోఘాట్ రోడ్డుకు కలిపే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసింది. ఈ ఫ్లైఓవర్ ద్వారానే భక్తులు కొండపైకి వెళ్తున్నారు. వాస్తవానికి తులసీకాటేజ్ నుంచి ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ నుంచి కొండపైకి వెళ్లి... రెండో ఘాట్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్ మీదుగా కిందికి వెళ్లాలి.

కరోనా నుంచి నత్తనడకన పనులు

ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి నుంచి మొదటి ఘాట్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ పనులు అసంపూర్తిగా నిలిచాయి. రూ.34కోట్లతో నిర్మించతలపెట్టిన ఈ ఫ్లైఓవర్ పనులు కొవిడ్-19 ప్రారంభమైన నాటి నుంచి నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరుచేసి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. కొండకింద స్వామివారి చెంతకు వచ్చే భక్తులకోసం అత్యాధునికంగా అన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. భవనం పనులు పూర్తికాగా భక్తులు భోజనాలు చేసేందుకు అరకొర సౌకర్యాలు ఉన్నాయి. దీంతో భక్తులు నేలపైన కూర్చొని అన్న, ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. రూ.కోటి కేటాయించినట్లయితే అన్నదాన సత్రం పనులు పూర్తవుతాయి. భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినట్లయితే వందలాది మంది భక్తులు అన్నదాన ప్రసాదాలు స్వీకరించే అవకాశాలున్నాయి. వైటీడీఏకు సంబంధం లేకుండా ఆలయ నిధులతో అన్నదాన సత్రాన్ని పూర్తి చేసేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అనుమతించాలని అధికారులు కోరినట్లు సమాచారం. పెద్దగుట్టపై దాదాపు రూ.2కోట్లతో వైటీడీఏ అతిథి గృహాన్ని నిర్మించింది. ఈ భవనాన్ని నిర్మించి రెండేళ్లు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచలేదు. భక్తులు, వీవీఐపీలు, వీఐపీల ఆతిథ్యం కోసం 13 ఎకరాల్లో రూ.105కోట్లతో అత్యాధునిక వసతులతో 15విల్లాలు నిర్మించిన ప్రెసిడెన్షియల్ సూట్ ఉండగా, పెద్దగుట్టపైన వైటీడీఏ మరో అతిథిగృహాన్ని ఎందుకు నిర్మించిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాయిగిరి చెరువు వద్ద ఏర్పాటుచేసిన శిల్పారామం పనులు తుదిదశలో నిలిచిపోయాయి. ఈ పనులు పూర్తయితే గుట్టకు వచ్చే భక్తులకు శిల్పారామం ఆహ్లాదకరంగా మారనుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని భక్తులు కోరుతున్నారు.



కొండకింద నిర్మించిన అన్నదానసత్రంలో సరైన వసతులులేక నేలపై కూర్చొని తింటున్న భక్తులు

వైటీడీఏ ప్రక్షాళన

ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు గత ప్రభుత్వం వైటీడీఏను ఏర్పాటుచేసింది. వైటీడీఏ స్థానంలో యాదగిరిగుట్ట ఆలయానికి ప్రత్యేకంగా మండలి ఏర్పాటుకానుంది. ఈ మండలిలో చైర్మన్‌తోపాటు ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. అయితే ఇప్పటివరకు గుట్టలో జరిగిన అభివృద్ధి పనులన్నీ వైటీడీఏ ఆధ్వర్యంలోనే చేపట్టారు. గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైటీడీఏను ప్రభుత్వం ప్రక్షాళన చేయనున్నట్లు సమాచారం. మరోవైపు గతం నుంచి కూడా వైటీడీఏకు చైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తుండగా, వైస్‌చైర్మన్‌గా రిటైర్ ఐఏఎస్ అధికారి కిషన్‌రావు గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీతోపాటు పలువురు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రిటైర్ అయి కీలక శాఖల్లో పనిచేస్తున్న అధికారులందరికీ ఉద్వాసన పలికింది. గతంలో ఈవోగా పనిచేసిన ఎన్.గీత మూడేళ్ల క్రితం రిటైర్డ్ అయినప్పటికీ విధులు నిర్వహించగా, ప్రభుత్వం ఆమెను తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే వైస్‌చైర్మన్‌గా కొనసాగుతోన్న కిషన్‌రావుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం ప్రత్యేక దృష్టి సారించడంతో వైటీడీఏను పూర్తిగా ప్రక్షాళన చేసే అవకాశం ఉంది.

భూనిర్వాసితులకు పెండింగ్‌లోనే బిల్లులు

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గుట్ట ఉత్తరభాగంలో భూసేకరణ చేపట్టింది. యాదగిరిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.73, సర్వే నెం. 78, సర్వే నెం. 119లలో తొలి విడతలో 93.03ఎకరాలు, రెండోవిడతలో 49.24ఎకరాలు మొత్తం 142.27ఎకరాలను సేకరించింది. ఊరకుంట చెరువు పక్కనున్న ఇళ్లు, ఇంటి స్థలాలపై భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసింది. విశాలంగా రోడ్లను నిర్మించేందుకు భూసేకరణ చేపట్టింది. అయితే దాదాపు భూ నిర్వాసితులకు రూ.101 కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పరిహారం కాకుండా భూమికి భూమి ఇవ్వాలని పలు ప్రాంతాల్లోని రైతులు పట్టుపడుతున్నారు. వీరికి సంబంధించిన భూముల వివరాలు ధరణిలో పీవోబీలో చేర్చారు. దీంతో పరిహారం రాక ధరణిలో పీవోబీలో చేర్చడంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు.

భూచట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

- విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: భూచట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. గురువారం భువనగిరిలో జరిగిన బీఎల్‌ఎఫ్ భూసదస్సులో ఆయన మాట్లాడారు. పాలకులు భూ చట్టాలను అమలు చేయడంలో విఫలమైనా, నిర్లక్ష్యం చూపినా ప్రజలే ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా భూ చట్టాలను అమలు చేస్తే చట్టబద్ధమే అవుతుంది తప్ప నేరం కాదన్నారు. ప్రజల పోరాటాల ఫలితంగానే 1969లో అసైన్డ్‌చట్టం, 1970లో అటవీ హక్కుల చట్టం, 1971లో భూ పరిమితి చట్టం, 1973లో కౌలుదారీ చట్టం వచ్చాయన్నారు. కానీ ఈ చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయన్నారు. అర్థ, అంగ, అధికార బలం కలిగిన భూ స్వామ్య శక్తులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని భూములను అన్యాక్రాంతం చేస్తున్నాయన్నారు. భువనగిరిలో కూడా పేదలకు ఇచ్చిన కోట్లాది రూపాయల విలువైన పట్టాలు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. పట్టా భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సదస్సులో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నూనె వెంకట స్వామి, వరికెల గోపాల్, సీస శ్రీనివాస్‌గౌడ్, మైలారం జంగయ్య, వల్లపు రాజమల్లు, బి.స్వప్న, అంతటి అనిత తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు డీఆర్‌డీవో సురేష్



మోత్కూరులో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అదనపు డీఆర్‌డీవో సురేష్

మోత్కూరు, సెప్టెంబరు 5: ఉపాధి హామీ పనుల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు డీఆర్‌డీవో సురేష్ అన్నారు. గురువారం మోత్కూరు మండల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉపాధి పనుల 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూలీలకు సంబంధించిన వర్క్ ఫైల్ సక్రమంగా ఉండాలని, ప్రతీ నెల 3వ శుక్రవారం రోజ్‌గార్ దివస్ యోజన కింద కూలీలకు వారి హక్కులు, బాధ్యతలు, ఉపాధి హామీ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో సిటిజన్ చార్టులు ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. పనుల నిర్వహణలో తప్పిదాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని 10 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో రూ.2,32,85,060 వ్యయంతో 345 పనులు చేయగా వాటి ఆడిట్ నివేదికలను సామాజిక తనిఖీ డీఆర్‌పీలు ప్రజావేదికలో ప్రవేశపెట్టారు. మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో అసిస్టెంట్ జిల్లా విజిలెన్స్ అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ వీరమల్లు, అసిస్టెంట్ విజిలెన్సు మేనేజర్ ఆదిత్య, ఎంపీడీవో పి.శంకరయ్య, ఎంపీవో జనార్ధన్ రెడ్డి, ఎస్టీఎం అంజగౌడ్, ఎస్‌ఆర్‌పీ రాజు, ఏపీవో కరుణాకర్, టీఏలు జాఫర్, యాదగిరి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

వలిగొండ, సెప్టెంబరు 5: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మనోహర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ సూచించారు. మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అరూరు, వెల్వర్తి ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది అన్ని సమయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసిద్ధ్, అనురాధ, రమేష్, ప్రవీణ్, మరియమ్మ, రేణుక, జానకిరాములు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: సహజ ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎల్.యశోద అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఏలు, ఆశా కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించాలని, ప్రధానంగా సహజ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. పెద్దవాళ్లకు క్షయ(టీబీ) టీకా సర్వేతోపాటు హెచ్ఐవీ స్క్రీనింగ్ క్యాంపెయిన్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతీరోజు జ్వర సర్వేను నిర్వహించాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు తల్లులకు తగిన సూచనలు చేయాలని, ప్రతిఒక్కరూ సమయ పాలన పాటించాలన్నారు. సమావేశంలో పీవో ఎన్‌సీడీ డాక్టర్ సుమన్ కల్యాణ్, పీహెచ్‌సీ వైద్యాధికారులు కాటంరాజు, సంపత్ కుమార్, హెచ్ఇ వసంత, ఎస్‌యూవో మధుమోహన్, హెచ్‌ఈవోలు సత్యనారాయణ, ఇస్తారి, పీహెచ్‌ఎన్ శశికళ, ఝాన్సీ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వాలి

- ఏసీపీ రవికిరణ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో 100 ఇళ్ల తనిఖీ



అనుమతి పత్రాలు లేని వాహనాలను చూపుతున్న పోలీసులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: పట్టణంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా భువనగిరి అర్బన్ కాలనీలో గురువారం పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని ఫేస్-2లోని వంద ఇళ్లను తనిఖీచేసి ఆధార్‌కార్డు తదితర ధ్రువపత్రాల ఆధారంగా స్థానికులను పరిశీలించారు. అనుమానితుల గృహాలను తనిఖీలుచేసి పోలీసు రికార్డుల్లో ఉన్న పాత నిందితుల ప్రవర్తనపై ఆరా తీశారు. ధ్రువపత్రాలు లేని ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద ఘటనలు, వ్యక్తులపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పుకార్లను నమ్మవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది కలిపి 50 మందికి పైగా తనిఖీల్లో పాల్గొన్నారు.

కురుస్తున్న చిరుజల్లులు

- జిల్లావ్యాప్తంగా 5.2 మి.మీ.ల వర్షపాతం నమోదు

యాదాద్రి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తుంది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు జిల్లాలో 5.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా చౌటుప్పల్‌లో 28.1 మి.మీ.లు, అత్యల్పంగా మోటకొండూరులో 0.3 మి.మీ.ల వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలో వర్షాలు తగ్గడంతో మూసీ వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. రుద్రవెల్లి, సంగెం బ్రిడ్జీల పై నుంచి వాహనాలకు అనుతిచ్చారు.

విద్యావ్యవస్థ పటిష్టానికి ప్రభుత్వం కృషి

- మట్టిలో మాణిక్యాలను వెలికితీసే బాధ్యత గురువులదే
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- కలెక్టరేట్‌లో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 5: విద్యా వ్యవస్థ పటిష్టానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. నిబద్ధత, అంకిత భావంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారన్నారు. మట్టిలో మాణిక్యాల వంటి విద్యాకుసుమాలను వెలికి తీసే బాధ్యత గురువులదేనన్నారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జిల్లాలో రూ.23.80కోట్లతో 588 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పించి విద్యారంగానికి పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో 718 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని, విద్యా వ్యవస్థను పటిష్ట పర్చేందుకు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఉపాధ్యాయ ఖాళీలను తన దృష్టికి తెస్తే, ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి విన్నవిస్తానన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల కోసం ఎంతో కృషి చేస్తోందని, ఒకటో తేదీన వారికి వేతనాలు అందేవిధంగా చర్యలు తీసుకుందన్నారు. ఉపాధ్యాయుల కోర్కె మేరకు బదిలీలు, పదోన్నతులు కల్పించిందన్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ అమ్మఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక బోధనకు జిల్లాలో దాతలు కూడా తమ వంతు సహకారం అందిస్తూ స్మార్ట్ తరగతుల సౌకర్యం కల్పిస్తున్నారని, మంచు లక్ష్మి తమ ఫౌండేషన్ ద్వారా 85 పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జడ్పీ సీఈవో శోభరాణి పాల్గొన్నారు.



సర్వేపల్లి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విప్ అయిలయ్య, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, పక్కన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

భువనగిరి టౌన్: సమాజ పురోగతి ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉందని ఇంటర్ నోడల్ అధికారి రమణి అన్నారు. భువనగిరిలోని ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాపిరెడ్డి, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను వివరించి వారిని ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అలాగే రోటరీ క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు. అదే విధంగా భువనగిరిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ ఒకేషనల్ కళాశాల ఫ్రెషర్స్ డే లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించాలి : కూరెళ్ల

వలిగొండ, రామన్నపేట: విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. వలిగొండ, రామన్నపేటలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. నా ఆశ, నా ఆదర్శం, పుస్తక పఠనానికే అంకితం అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. చేయూత ఫౌండేషన్ అధినేత వాకిటి రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధన ద్వారా, తాను పారిశ్రామికవేత్తగా ఎదిగానని గుర్తుచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుంకోజు భాస్కర్, వాకిటి రామ్‌రెడ్డి, చంద్రకళారెడ్డి, వెంకట్‌రామిరెడ్డి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వను పూర్తి చేయాలి : సీపీఎం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: జిల్లాకు సాగునీరు అందించే బునాదిగాని కాల్వ పనులను పూర్తి చేసి విషతుల్య మూసీ నీటికి బదులు గోదావరి జలాలను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యంతో దశాబ్దాలుగా బునాదిగాని కాల్వ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. 98.64 కిలో మీటర్ల కాల్వ పనులు నేటికీ కేవలం 34 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యాయని, 259 కల్వర్టులు, బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉండగా కేవలం 33 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారన్నారు. రూ.33కోట్లతో ప్రతిపాదించిన పనులు రూ.250 కోట్లకు చేరాయన్నారు. కాల్వ పనులను పూర్తిచేసి, గోదావరి జలాలు విడుదలచేసి 50చెరువులను నింపి 6వేల ఎకరాలకు సాగు నీటిని అందించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సెప్టెంబరు 10, 11 తేదీల్లో జిల్లాలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, మాయ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

నిందితులను కఠినంగా శిక్షించాలి



జిల్లాకేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: జైనూర్ ఆదివాసీ మహిళపై అత్యాచారంచేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధూరి చంద్ర అన్నారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మతం ఆధారంగా నిందితులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మహిళలకు కావాల్సింది ఉచిత పథకాలు కాదని, వారి ప్రాణాలకు రక్షణ కావాలన్నారు. జైనూర్ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు ఆలస్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మోర్చా నాయకులు కుమ్మరి లక్ష్మి, లక్కాకుల మాధవి, రంగా రేఖ, చామకూర చిత్రలేఖ, శేశత్వం అర్చన, కీర్తి, మల్లిక, శోభ, చంద్రకళ, రమ్య, పాల్గొన్నారు.

ముగిసిన మదర్ డెయిరీ నామినేషన్ల పరిశీలన


ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీలోని ఆరు డైరెక్టర్ పదవులకు జరుగుతున్న ఎన్నికలకు బుధవారం 21మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 15మంది నామినేషన్లు వేయగా, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరు మంది నామినేషన్లు వేశారు. గురువారం మదర్ డెయిరీ కార్యాలయంలో ఎన్ని కల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా 21 నామినేషన్లు సవ్యం ఉన్నట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి.

పార్టీ అభివృద్ధికి రాములు సేవలు శ్లాఘనీయం

విగ్రహావిష్కరణ సభలో త్రిపుర రాష్ట్ర గవర్నర్


నల్లగొండలో ఓరుగంటి రాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

రామగిరి, సెప్టెంబరు 5: పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు సేవలు శ్లాఘనీయమని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓరుగంటి రాములు సంస్మరణ సభ, విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రాములు జీవితాంతం పార్టీ అభివృద్ధికి, దేశ రక్షణ, హిందూ ధర్మం కోసం పనిచేశారన్నారు. జనసంఘ్ కార్యకర్తగా అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగాడన్నారు. 1981లో నల్లగొండ బీజేపీ అభ్యర్థి మునిసిపల్ చైర్మన్‌గా గెలుపొందటంలో రాములు క్రియాశీలక పాత్ర పోషించాడన్నారు. తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేసినప్పుడు రాములు చేసిన సహాయ సహకారాలు మరవలేనివన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పరిష్కరించేవారని గుర్తుచేసుకున్నారు. రాములుతో తనకు ఎంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు. జనసంఘ్ కార్యకర్త నుంచి అంచెలంచెలుగా బీజేపీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. నల్లగొండలో దేవాలయ సమస్యను పరిష్కరించినట్లు ఆయన గుర్తుచేశారు. 1981లో నల్లగొండ మునిసిపల్ చైర్మన్‌బీజేపీ సొంతం చేసుకోవడంలో రాములు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. రాములు ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసి సఫలీకృతం కాకపోయినా, పార్టీ గ్రామ గ్రామాన విస్తరించాలన్న లక్ష్యంతో పని చేశారని అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా నీరసపడకుండా పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పని చేసినట్లు తెలిపారు. తాను నల్లగొండ ఎంపీగా పోటీగా చేసినప్పుడు రాములు చేసిన సహాయ సహకారాలు మరవలేనివన్నారు. అలాంటి వ్యక్తి ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నానని పేర్కొన్నారు. ఇదే క్రమంలో తన పాత మిత్రులను గుర్తు చేసుకున్నారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఓరుగంటి రాములు పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, పోలీసు కేసులు వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమస్యను పరిష్కరించేవారన్నారు. ఈ సమావేశంలో ఓరుగంటి రాములు సతీమణి ధనలక్ష్మి, కుమారులు శ్రీనివాస్, వంశీ, మాధవప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, మల్లేష్‌యాదవ్, గార్లపాటి వెంకటయ్య, నన్నూరి రాంరెడ్డి, కర్నాటి విజయ్‌కుమార్, కల్లెం బాల్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, పెరిక మునికుమార్, ఎర్రమల్ల భాస్కర్, కూతురు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంతి పూల సాగు... భలే బాగు



కట్టంగూరు, సెప్టెంబరు 5: బంతిపూల సాగులో లాభాలు ఉండడంతో రైతులు అటు వైపు దృష్టి సారిస్తున్నారు. బంతి పూల సాగులో ఎంత పెట్టుబడి పెడతామో అదే స్థాయిలో లాభాలు వస్తుండడంతో నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామ పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన యువ రైతు ఎరుకల వేణు తనకున్న 10గుంటల వ్యవసాయ భూమిలో నాలుగు సంవత్సరాల నుంచి బంతిపూలను సాగు చేస్తున్నారు. భూమి సాగు, ఎరువులు, మొక్కలు, భూమి దున్నడం లాంటి వాటి కోసం సుమారు రూ.25వేలు ఖర్చు వస్తుందని వేణు తెలిపారు. రెండు నెలల పాటు(జూన్,జూలై) బంతి చెట్లను పెంచితే, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో బంతిపూలు చేతికొస్తాయి. పండుగల సీజన్లో కేజీ రూ.150, సీజన్ లేనపుడు కేజీ రూ.100కు విక్రయిస్తున్నారు. వాతావరణం అనుకూలించి పూల సాగకు అనుకూలంగా వర్షాలు పడితే 10గంటల సాగుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు అందించవచ్చు వేణు తెలిపారు.

బంతిపూల సాగుతో లాభాలు

బంతిపూల సాగుతో లాభాలు పొందుతున్నాం. 10గుంటల భూమిలో బంతిపూల సాగు చేస్తే సుమారు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు వస్తున్నాయి. నాలుగు సంవత్సరాల నుంచి బంతిపూలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నాం. సీజన్‌లో బంతిపూలను కేజీ రూ.150, సీజన్ లేనప్పుడు కేజీ రూ.100కు విక్రయిస్తాం.

● ఎరుకల వేణు, యువరైతు రాంనగర్, కట్టంగూర్.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 5: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చెత్తను ఎప్పటికప్పుడు తిలగించేలా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తిలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలోని మొక్కలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. తాగునీటి ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తుండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో స్వచ్ఛదనం కార్యక్రమం పగడ్బందీగా చేపట్టాలని చెత్తాచెదారంను తొలగించాలని సూచించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. చెత్తా చెదారం, నీటినిల్వలు లేకుండా సీజనల్ వ్యాధులకు కారణమవుతాయని పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రత అనారోగ్య సమస్యలను పారదోలవచ్చన్నారు. ఆయన వెంట చిట్యాల ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగుతున్నాయి. అండర్-11 బాలబాలికల పోటీలకు తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు నేషనల్స్‌లో స్థానం కోసం తలపడుతున్నారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ పర్యవేక్షిస్తున్నారు.

ఆపదలో ఉన్నవారు హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్‌చేయాలి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: మహిళలు, పిల్లలు ఆపత్కాలంలో హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098కు ఫోన్ చేసి రక్షణ పొందాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షిల్ లిటరసీ మనిషా అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని తాతానగర్, ఎరుకల బస్తీ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన వంద రోజుల సంకల్ప్ కార్యకలాపాల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన, గృహ హింస తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు, బాలమణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 5: అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నేతాపురం గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన 80 సంవత్సరాల వృద్ధురాలైన కోరె లింగమ్మ కొన్నేళ్లుగా చిన్న గుడిసెలో నివాసం ఉంటుంది. గురువారం సాయంత్రం గ్రామంలో ఉన్న తన కుమార్తె బుచ్చమ్మ ఇంటి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకోవడంతో తగలబడుతుండగా స్థానికులు చూసి వెంటనే మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో లింగమ్మకు చెందిన వంట సామాను, ఇంట్లోని దుస్తులు, ఇతర సామాగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. వృద్ధురాలు లేని సమయంలో గుడిసె కాలిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

బాబోయ్ దొంగలు

● తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఆగంతకులు



చింతపల్లి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ (మాల్)లో దొంగల బెడద తీవ్రమైంది. మండలం గొడకొండ్ల గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని తాళం వేసిన ఇళ్లలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరపడి చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ఏ ఇంట్లో, వ్యాపార దుకాణంలో చోరీ జరుగుతుందోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చింతపల్లి మండల కేంద్రానికి 25కిలోమీటర్ల దూరంగా ఉండటం వల్ల రాత్రి సమయంలో పోలీసులకు ప్రజలకు నిఘా ఏర్పాటు చేయాలంటే కొద్దిగా ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న వెంకటేశ్వరనగర్ ఉండటంవల్ల చోరీ చేసిన ఆగంతకులు రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్‌కు కలిసిపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

వీటీనగర్‌లో కనిపించని సీసీ కెమెరాలు

రెండు జిల్లాల కూడలి ప్రధాన వ్యాపార కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందుతున్న వెంకటేశ్వరనగర్(మాల్)లో గతంలో ఎస్పీ దుగ్గల్ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరిగిన వెంటనే సీసీ కెమెరాల సహాయంతో సమాచారం తెలుసుకునేవారు. ఇటీవల సాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారి వేంకటేశ్వరనగర్‌లో రోడ్డు వెడల్పు చేయడంతో సీసీ కెమెరాలు కనిపించకుండా పోయాయి. సకాలంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఏ జిల్లా నుంచి ఏ ప్రాంతం నుంచి దేనికోసం వస్తున్నారో గుర్తించడం క్లిష్టంగా మారింది.

ఇంట్లో నుంచి బయటకు వెళ్లారా అంతే సంగతులు

వెంకటేశ్వరనగర్‌కు చెందిన మహమ్మద్ ఖలీల్ రఫీయా ఖాతున్ గస్టు 8వ తేదీన ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి వారు ఇంటికి చేరుకోని సరికి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగలుకొట్టి 80 తులాల వెండి ఆభరణాలు, 3 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు.

● ఆగస్టు 22న గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన మల్లోజు విష్ణుమూర్తి దేవరకొండలోని ఆర్టీసీ డిపోలో బస్సు మెకానిక్‌గా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే విధుల నిర్వహించడకోసం వెళ్లగా, భార్య ఇంటికి తాళాలు వేసుకొని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇదే సమయంలో దొంగలు ఎవరూ లేరని తెలుసుకొని తాళాలు పగలకొట్టి 12 తులాల వెండి ఆభరణాలను దోచుకువెళ్లారు.

● ప్రముఖ విశ్రాంత అధ్యాపకుడు చేపూరి బ్రహ్మచారి జగదాంబ వారి ఆస్పత్రికి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ నెల 8న ఎంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి వేళ్లలో దొంగలు ఇంట్లోకి చొరపడి 2 కిలోల వెండి ఆభరణాలు రూ. 5 వేల నగదును తీసుకెళ్లారని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తాం



వెంకటేశ్వరనగర్(మాల్)లో త్వరలో వ్యాపారస్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దొంగతనాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. వెంకటేశ్వరనగర్‌లో పెట్రోలింగ్ ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాల కోసం ప్రజలతో సమావేశం నిర్వహించి వారి సహకారంతో నిఘా వ్యవస్థ పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేముందు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. గుర్తుతెలియని వ్యక్తులు తిరిగితే 100కు సమాచారం ఇవ్వాలి.

● యాదయ్య ఎస్‌ఐ, చింతపల్లి

జడ్పీలో కారుణ్య భర్తీలేవీ?

● ఏడు సంవత్సరాలుగా భర్తీకాని 150పోస్టులు
● కౌన్సిలింగ్‌కు ముందుకు రాని బాధిత కుటుంబాల సభ్యులు
● అటెండర్ పోస్టులు కావడమే వెనుకంజకు కారణం
● జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కోసం పట్టు

నల్లగొండ, సెప్టెంబరు 5: జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకాల పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోంది. స్థానిక సంస్థల ఉద్యోగులు ఎవరైనా మరణించినా, ఆరోగ్య కారణాల రీత్యా ఉద్యోగం చేయలేని పరిస్థితుల్లో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నా సదరు ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాల్సి ఉంటుంది. ఈ విధానం అనేక సంవత్సరాలుగా కొనసాగుతోంది. నల్లగొండ జిల్లా పరిషత్ పరిధిలో వివిధ సెక్షన్‌లలో 150పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరేడు సంవత్సరాలుగా ఈ పోస్టులు భర్తీ కావడం లేదు. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీరాజ్‌తో పాటు స్థానిక సంస్థల పరిధిలో ఎవైనా ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ మరణించిన, వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించడమే కారుణ్య నియామక లక్ష్యం. సదరు ఉద్యోగి మృతితో వారి కుటుంబాలు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతుంతారు. జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగుల వారసులు కారుణ్య నియామకాల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్ కాలంలో మరణిస్తే ఆ వ్యక్తి కుటుంబంలో భార్య, భర్తకు, కుమారుడికి, కూతురికి లేదంటే కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు వారిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. వారి అర్హత ఆధారంగా మృతిచెందిన ఉద్యోగి తత్సమాన ర్యాంకు ప్రకారం అదేస్థాయిలో ఉద్యోగం లేదంటే తక్కువ స్థాయిలో ఉద్యోగం కల్పించాల్సి ఉంటుంది. ఇది ఉద్యోగుల హక్కుతో పాటు సర్వీస్ నిబంధనలో కూడా ఉంది.



అటెండర్ పోస్టులే కారుణ్య నియామకాలకు ఆంటంకం

కారుణ్య నియామకాల భర్తీ నల్లగొండ జిల్లా పరిషత్‌లో కొనసాగుతున్నప్పటికీనీ అవి అంతంతా మాత్రమే ఉంటున్నాయి. దీని ప్రధాన కారణం అటెండర్ పోస్టులు మాత్రమే 150పోస్టులు ఉండటం తప్ప ఉన్నత పోస్టులు లేకుండా పోయాయి. అటెండర్ పోస్టుల పట్ల(ఆఫీస్ సబార్డినేట్) మృతిచెందిన కుటుంబ సభ్యుల పిల్లలు లేదంటే ఇతర పెద్దలు విముకత చూపిస్తూ ముందుకు రావడం లేదు. మండల పరిషత్, ఇతర స్థానిక సంస్థల్లో సబార్డినేట్ ఉద్యోగాలు తప్ప మిగతా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నుంచి ఈ నియామకాలు అరకొరగా సాగుతున్నాయి. ఈ ఉద్యోగాలకు సంబంధించి అంటెండర్ పోస్టులోనే నియామక ప్రక్రియ చేపట్టడంతో డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్‌తో పాటు కాస్తా ఆర్థికంగా ఉన్న బాధిత కుటుంబాల పిల్లలు లేదంటే వారి కుటుంబ సభ్యులు అంటెండర్ పోస్టులు కాకుండా జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కోరుకోవడం మూలంగా జిల్లాలో నియామకాల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కోరుకుంటుండంతో కారుణ్య నియామకాల పోస్టులు భర్తీ కావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 ఏళ్ల నుంచి 61ఏళ్లకు పెంచడంతో గతంలో మాదిరిగా ఖాళీలు కూడా ఏర్పడటం లేదు. కారుణ్య నియామకాల్లో డిగ్రీ అర్హత ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, తెలుగు, ఇంగ్లీష్ హాయ్యర్ ఉత్తీర్ణత ఉన్నవారికి టైపిస్టు ఉద్యోగాలు, పదో తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం ఇస్తారు. జిల్లాలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారిలో అత్యధికంగా ఉన్నత విద్యను అభ్యసించిన వారు ఉండటం వారు కోరుకున్న విధంగా పోస్టులు లేకపోవడం సమస్యగా మారింది. కొంతమంది డిగ్రీ పూర్తి చేసే దశలో పిల్లలు సైతం తమకు అటెండర్ బదులు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టు కావాలంటూ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఆర్జీ పెట్టుకున్నారు.

పైస్థాయి కేటగిరి ఖాళీలపై దృష్టి సారించని ప్రభుత్వం

ప్రతి ప్రభుత్వ శాఖలోను అటెండర్ పోస్టులను మాత్రమే కారుణ్య నియామకాల కోసం ఖాళీలు చూపిస్తున్న ప్రభుత్వం సబార్డినేట్ పై స్థాయి ఖాళీలను మాత్రం ఖాళీలుగా చూపించకపోవడంతో జిల్లా పరిషత్ పరిధిలో పోస్టుల భర్తీకి తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా పరిషత్ అధికారులు ఈ ఆరేడు సంవత్సరాలుగా కారుణ్య నియామకాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇస్తూ కౌన్సిలింగ్‌కు ఆహ్వానిస్తున్నా వచ్చిన బాధిత కుటుంబ వారసుడు తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టు క్యాడర్ కలిగిన ఉద్యోగం ఇస్తేనే జాయిన్ అవుతామంటున్నారు. ఉన్నత చదువులు చదివి అటెండర్ పోస్టులో జాయిన్ అయితే పదోన్నతి వచ్చే వరకు ఏళ్ల సమయం పడుతుందని, సగం సర్వీస్ పూర్తి అవుతుందన్నా ఆలోచనతోనే అటెండర్ పోస్టులో బాధ్యతలు తీసుకోవడానికి వారసులు వెనకంజ వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కారుణ్య నియామకాల భర్తీ కోసం ఏ విధమైన ఆలోచన చేస్తుదనే దానిపై ఎదురు చూస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు ఇతర పై క్యాటగిరి పోస్టులను భర్తీ చేస్తారా లేదా అనేది చర్చ సాగుతోంది. జిల్లా పరిషత్‌లో 2018 సంవత్సరం నుంచి కారుణ్య నియామకాలు పూర్తి స్థాయిలో జరగడం లేదు. జడ్పీ కార్యాల యంలో వివిధ హోదాలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలు, అటు కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి ఓ వైపు కోరుతునే మరోవైపు అటెండర్ పోస్టులకు బదులుగా ఉన్నత పోస్టులను కోరుతుండడంతో పెండింగ్ పడుతోంది.

కౌన్సిలింగ్‌కు పిలిచినా ముందుకు రావడం లేదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల పోస్టుల భర్తీకి అనేక సార్లు నిర్ణయం తీసుకున్నాం. కౌన్సిలింగ్‌కు పిలిచిన కూడా ముందుకు రావడం లేదు. అటెండర్ పోస్టుల పట్ల వారు విముఖత చూపుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారు అటెండర్ పోస్టులల్లో జాయిన్ కావడం లేదు. దీంతోనే చాలా కాలంగా కారుణ్య నియామకాలు పూర్తి స్థాయిలో చేపట్ట లేకపోయాం. చనిపోయిన వారి వారసులు ఖాళీగా ఉన్న పోస్టుల్లో జాయిన్ కావడానికి ముందుకు వస్తే నియామకాలను వెంటనే చేపడతాం.

● ప్రేమ్‌కరణ్ రెడ్డి, జడ్పీ సీఈవో, నల్లగొండ

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 5: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్య కైంకర్యాలు గురువారం పాంచా రాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహిం చారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.14,10,624ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ కోదండరాం సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం అందజేశారు.



ఆలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెర్వు, సెప్టెంబరు 5: సూర్యాపేట జల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని వేపలమాదారం గ్రామంలో 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వేపలమాదారం గ్రామానికి చెందిన నాగులమీరా ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఓ షెడ్డులో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 13 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నాగుల్‌మీరాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సీజ్ చేసిన మద్యం బాటిళ్లు ధ్వంసం



సూర్యాపేటలో మద్యం బాటిళ్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 5: సూర్యాపేట పట్టణంలో కొంత కాలంగా వివిధ కేసుల్లో సీజ్ మద్యాన్ని గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. కొంత కాలంగా పట్టణంలో నమోదైన 72 కేసులకు సంబంధించిన రూ.2.5లక్షల విలువ చేసే వివిధ రకాల బ్రాండ్ల మద్యాన్ని నిర్వీర్యం చేశారు. కార్యక్రమంలో ఈఎస్ లక్ష్మానాయక్, పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్, ఎస్ఐలు లోకేష్‌కుమార్, బాల్నె కుశలవ సిబ్బంది పాల్గొన్నారు.

'పేట'లో రెండు కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తరలించి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సూర్యాపేట డీఎస్పీ జి. రవి వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురైనగర్‌కు చెందిన భోగ చరణ్, జేజేనగర్‌కు చెందిన అతని స్నేహితుడు చిలకరాజు సందీప్ కలిసి నాలుగు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతంలో ఓ వ్యక్తి వద్ద రూ. 5వేలు చొప్పున రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి గంజాయి సూర్యాపేటకు తీసుకొచ్చారు. ఇతరులకు విక్రయించేందుకు పట్టణంలోని రాజీవ్‌పార్కు సమీపంలో వేచి ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేసి గంజాయితో పాటు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్, పట్టణ ఎస్ఐ లోకేష్ కుమార్, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, గోదేశి కర్నాకర్, శ్రీరాములు, జోగు సైదులు, చీకూరి మధు ఉన్నారపాజ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

పగలంతా రెక్కీ.. రాత్రి ఇళ్లలో దొంగతనాలు

కొండాపూర్, సెప్టెంబరు 5: పగలంతా రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను లక్ష్యం చేసుకుని రాత్రి వేళలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని సంగారెడ్డి జిల్లాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండాపూర్ సీఐ చంద్రయ్య గురువారం వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయల గూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు(30) తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. జల్సాలకు, తాగుడుకు బానిసై ఇళ్ల, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బుధవారం రాత్రి మల్కాపూర్ చౌరస్తాలో కొండాపూర్ పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానంగా కన్పించిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించారు. 30ఇళ్ల చోరీల్లో 39.4 తులాల బంగారు ఆభరణాలు, 188తులాల వెండి, రూ.9.50లక్షల నగదు, రెండు బైకులను అపహరించినట్లు వెల్లడించారు. మొబైల్ ఫోన్ వాడకుండా ఎటువంటి సామగ్రి తీసుకెళ్లకుండా ఒంటరిగా వెళ్లి ఇంటి ఆవరణలో ఉండే ఇనుపరాడ్లు, రాళ్లతో తాళాలను పగులగొట్టి అపహరించేవాడు. నిందితుడిపై మెదక్, సంగారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, వికారాబాద్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కొండాపూర్, సీసీఎస్ పోలీసులకు సీఐ రివార్డులు అందజేశారు.



రికవరీ చేసిన నగలను, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

వాహనం ఢీకొని 11గొర్రెలు మృత్యువాత

పెద్దవూర, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పోతునూరు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి-167పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11గొర్రెలు మృతిచెందాయి. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా ఇమాంపేటకు చెందిన నగిరే గంగరాజుతో మరో ఐదుగురికి చెందిన జీవాలు నల్లగొండ జిల్లా పెద్దవూర సమీపంలోని పలు గ్రామాల్లో మేతమేపుకొని పోతునూరు వైపు వెళ్తుండగా మల్లెపల్లి నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వస్తు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 11గొర్రెలు అక్కడిక్కడే మృత్యువాత పడ్డాయి. మరికొన్ని గొర్రెలు గాయలపాలయ్యాయి. సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు రైతులు వాపోయారు. రైతుల ఫిర్యాదుపై దర్యాప్తు నమోదు చేఉసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు



గొర్రెల కలేబరాలు

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



తిప్పర్తి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన ఓర్సు వెంకటయ్య రెండో సంతానం రూపాని అరుణ(28) భర్తకు దూరంగా ఉంటూ తనకు ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో ఉంచి తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి గ్రామంలో ఐదు నెలలుగా గదిని అద్దెకు తీసుకొని నివాసముంటుంది. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లిన అరుణ తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన తండ్రి వెతకగా అచూకీ లభించలేదు. తన కూమార్తె అదృశ్యంపై చిట్యాల మండలం తేనెపల్లి గ్రామానికి చెందిన రూపాని అనిల్‌పై అనుమానం ఉందని అరుణ తండ్రి ఓర్సు వెంకటయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 5: బైక్ దొంగతనం కేసులో చౌటుప్పల్ మెజిస్ట్రేట్ వైష్ణవి మహతి ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధించినట్లు సీఐ మన్మథరావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా ఆత్మకూర్ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బద్దుల అనిల్, మోత్కూర్ మండలం శదర్శనపురం గ్రామానికి చెందిన బత్తిని స్వాతి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆరు నెలల క్రితం బైక్‌ను చోరీ చేశారు. ఎస్ఐ యాదగిరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకొని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ ఖాజా నిజామోద్దీన్ కేసును వాదించారు.

వరకట్నం వేధింపుల కేసులో జైలు

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 5: అదనపు వరకట్నం వేధింపుల కేసులో జైలు శిక్ష పడి తప్పించుకు తిరుగుతున్న భర్తను పోలీసులు అరెస్టు చేసిన ల్లగొండ జైలుకు పంపించారు. సీఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కాశమోని గోపాల్(32) తంగడపల్లికి చెందిన మహిళను 2016లో వివాహం చేసుకున్నాడు. పెళ్లి సందర్భంగా తల్లితండ్రులు కట్నకానుకలు ఇచ్చారు. పెళ్లి తర్వాత భర్త గోపాల్ భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేశాడు. భార్య భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అప్పటి ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేసి భర్తను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడు భువనగిరి కోర్టుకు అప్పీల్‌కు వెళ్లాగా కింది కోర్టు తీర్పునే అమలు చేయాలని మెజిస్ట్రేట్ తీర్పునిచారు. అప్పటి నుంచి నిందితుడు తప్పించుకొని తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించారు.

టెంకాయల విక్రయ వేలం రూ.60.60లక్షలు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 5: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే టెంకాయల విక్రయవేలం రూ.60.60 లక్షలకు పాడారు. ఏడాది కాలపరిమితికి గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేలంలో తొమ్మిది మంది వేలందారులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిక్కుళ్ల శ్రీనివాస్ రూ.606.0లక్షల అధికంగా పాడి కొబ్బరికాయల వేలం విక్రయ హక్కును దక్కించుకున్నారు. రెండో వేలందారుడైన కల్లూరి శ్రీనివాస్ రూ.60.50లక్షలకు వేలం పాడినట్లు గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్ మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, చెర్వుగట్టు మాజీ చైర్మన్ నల్ల వెంకన్న పాల్గొన్నారు.




వేలం నిర్వహిస్తున్న అధికారులు

స్వల్ప వాగ్వాదం

గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో కొంత వాగ్వాదం జరిగింది. గ్రామ పంచాయతీకి కొబ్బరికాయల వేలం హక్కుదారులు చెల్లించాల్సిన బకాయిలపై దుమారం రేగింది. వేలం డబ్బుల విషయంలో అవినీతి జరుగుతుందంటూ గ్రామస్థులు కొందరు అధికారులను నిలదీశారు. ఆధారాలుంటే చూపించి మాట్లాడాలని అధికారులు ఇచ్చిన సమాధానంతో కొందరు ఆగ్రహం చెందారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.70 అడుగులు



నిండుకుండలా ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు(312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 587.80 అడుగులుగా(305.9818టీఎంసీలుగా) ఉంది సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 96,399 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885అడుగులు(215.8070టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 884.80 అడుగులుగా (213.8878టీఎంసీలుగా) ఉంది. శ్రీశైలం ఒక క్రస్ట్ గేటును 10అడుగుల మేరకు ఎత్తి 27,937 క్యూసెక్కుల నీటిని, శ్రీశైలం కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 30,708 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 95,761 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 587.80 అడుగులు (305.9818టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8529 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,476 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 40,405 నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 95,761 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

నిలకడగా పులిచింతల వరద

మేళ్లచెర్వు: పులిచింతలకు ఎగువ నుంచి స్వల్పంగా 57,428 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం 6,41,250 క్యూసెక్కులుగా నమోదైన వరద నీరు సోమవారం సాయంత్రానికి 5,48,050 క్యూసెక్కులుగా నమోదు కాగా మంగళవారం సాయంత్రానికి 4,07,855 క్యూసెక్కులుగా నమోదైంది. మంగళవారం రాత్రి 11 గంటలకు ఒక్కసారిగా లక్ష క్యూసెక్కులకు తగ్గిన వరద బుధవారం సాయంత్రానికి 20వేల క్యూసెక్కులుగా నమోదైంది. గురువారం 50వేల క్యూసెక్కులు నమోదు కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు. (45.77) టీఎంసీలు కాగా, 173.78అడుగులు. (43.88 టీఎంసీలుగా) నమోదు కాగా తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్లను విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా ప్రాజెక్టు మొత్తం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 57,482 క్యూసెక్కులుగా నమోదైంది.

ఏడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల సరిహద్దుల్లో గల మూసీ ప్రాజెక్టుకు ఐదు రోజులుగా వరద కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఆలేరు, బిక్కేరులతో పాటు చిన్నాచితక వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టుకు వరద నీటిరాకడ భారీగానే ఉంటుంది. ఐదు రోజుల నుంచి ప్రాజెక్టుకు పెరిగిన వరద తాకిడి గురువారం సైతం కొనసాగింది. మంగళ, బుధవారాల్లో ప్రాజెక్టు ఏడు క్రస్టుగేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి ఎగువ నుంచి వస్తున్న వరదకు మించి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు గురువారం రెండు గేట్లు తగ్గించి ఐదు గేట్లను ఎత్తి 12,111క్యూసెక్కుల వరద నీటిని విడుదుల చేస్తున్నారు. మరోవైపు 641అడుగులకు పడిపోయిన ప్రాజెక్టు నీటిమట్టాన్ని గరిష్ఠ స్థాయికి చేర్చే చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో 8,773క్యూసెక్కులుగా నమోదైంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులుకాగా గురువారం సాయంత్రానికి నీటిమట్టం 641.30అడుగులుగా నమోదైంది. రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలకుగాను ప్రస్తుతం 3.52టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి భారీగా నీటిని వదులుతున్నారు.

రాధాకృష్ణన్ జీవితం ఆదర్శనీయం

చౌటుప్పల్ టౌన్ : సెప్టెంబరు 5: ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి, భారత తొలి రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. చౌటుప్పల్ పట్టణంలోని ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల, చందన స్కూల్, ట్రీనిటీ స్కూళ్లలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమాల్లో ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్ కళాశాల ప్రిన్సిపాల్ చిలువేరు శ్రీనివాస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.సరోజనమ్మ, చందన స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.రామేశ్వరి, ట్రీనిటీ స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని నమాత్‌పల్లి, రాయిగిరి, చీమలకొండూరు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ



చౌటుప్పల్‌లో ప్రతిభ ఒకేషనల కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ విజయ్‌మోహన్

అతికం లక్ష్మీనారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ పాల్యా హనుమంతు నాయక్, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, ప్రధానోపాధ్యాయులు అండాలు, జయంతి వైరోనిక పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని బండకొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, అనంతారం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నర్సయ్య సుధాకర్, ఉషశ్రీ, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూరు : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్ధార్థ ఫౌడేషన్ అధ్వర్యంలో ఉపాధ్యాయులును శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు గురువులను సన్మానించారు. రాజగోపాల్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గంధమల్ల విశ్వరూపం, బాగ్యశ్రీ, నాతి మల్లేష్, రాజశేఖర్‌రెడ్డి, అండాలు, సుధారాణి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని వివిధ ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులుసన్మానించారు.

రాజాపేట: మండలంలోని రాజాపేట, బొందుగుల రఘునాథ్‌పూర్, దూదివెంకట్‌పూర్, బేగంపేట తదితర గ్రామాల్లో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులను గ్రామస్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

అడ్డగూడూరు : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ టి.రమ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ ఉపాధ్యాయురాలుగా విజీనా అనే టీచర్ ఎంపియ్యారు. వీరిని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు గురుపూజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ వంగూరి పాండు, ప్రిన్సిపాల్ విశ్వనాథం, ఇన్‌చార్జి వంగూరి స్వాతి, ఉపాధ్యాయులు భానుప్రకాష్, దయాకర్, మురళి, పాషా, లావణ్య, సంధ్యారాణి, శైలజ, ప్రియాంక, లలిత, స్వాతి, సంతోష, నవీన్, సరిత, అనిత, మమత, ప్రణవి, గీతాంజలి, మౌనిక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భువనగిరిలో సాధన హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



భూదాన్‌పోచంపల్లి: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



ఆత్మకూరు(ఎం): కొరటికల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

బురదమడి కాదు..



ఆత్మకూరు(ఎం)లో బురదమడిని తలపిస్తున్న రోడ్డు



రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 5: పై చిత్రంలో కనిపిస్తున్నది బురదమడి కాదు..! మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్ నుంచి అంగడిబజారు వరకు గుంతలయంగా మారిన రోడ్డు. మండల కేంద్రానికి, పలు గ్రామాల ప్రజలకు ప్రధాన రోడ్ ఇదే కావడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే ఈ దారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పలువురు పేర్కొంటున్నారు. ఈరోడ్డుకు సెంట్రల్ లైటింగ్‌తో డబుల్ రోడ్డు చేస్తామని పలుమార్లు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఈరోడ్డుకు తక్షణమే మరమ్మతులు పనులు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మునిసిపల్ కమిషనర్ల బాధ్యతల స్వీకరణ

చౌటుప్పల్ టౌన్/భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 5: చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మునిసిపల్ కమిషనర్లు గురువారం బాధ్యలను స్వీకరించారు. చౌటుప్పల్ మునిసిపల్ కమిషనర్‌గా కెనర్సింహారెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. సిక్ లీవ్ లో ఉన్న నర్సింహారెడ్డి చౌటుప్పల్‌కు విచ్చేయగా, ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ భూదాన్ పోచంపల్లి మునిసిపల్ కమీషనర్ గా బదిలీ అయ్యారు. కాగా భూదాన్‌పోచంపల్లి మునిసిపల్ కమిషనర్‌గా ఎన్.వెంకటేశ్వర్‌నాయక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ కమిషనర్ కె.వీరారెడ్డి పోచారం మునిసిపాలిటీకి బదిలీపై వెళ్లారు.





నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌నాయక్

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 5: ట్రాఫిక్ నియంత్రణకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చిరు వ్యాపారులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ మధుసూదన్ సూచించారు. గురువారం భువనగిరి పాత బస్టాండ్, తహసీల్దార్, జడ్పీ, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట చిరు వ్యాపారులు రహదారిపై వ్యాపారం కొనసాగిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలగచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆర్ఎస్ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.



వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మధుసూదన్, ఎస్ఐ ప్రవీణ్

నోటరీ లైసెన్సులు ఇవ్వాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 5: నోటరీ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ న్యాయవాదికి నోటరీ లైసెన్సు ఇవ్వాలని ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి కోరారు. ప్రభుత్వం 10సంవత్సరాల నుంచి కొత్తగా నోటిఫికేషన్ వేయలేదని, వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతీ న్యాయవాదికి నోటరీ లైసెన్సు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న జనాభా, నోటరీలుగా పని చేసిన అడ్వకేట్‌లు కొంత మంది మృత్యువాత పడడంతో ఖాళీలు అయిన వాటిలో యువకులు అయిన, ఏడు సంవత్సరాలు వృత్తిలో అనుభవం ఉన్న న్యాయవాదులకు నోటరీ లైసెన్సులు ఇవ్వాలని కోరారు.

9 నుంచి సదరం శిబిరం

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 5: ప్రతీ నెలలో జరిగే సదరం శిబిరం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో టీ.నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న రెన్యూవల్, కొత్తగా స్లాట్లు నమోదు చేసుకునేవారు సమీపంలో మీ-సేవ కేంద్రాలను ఉదయం 11గంటలకు సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ నెల 10న వినికిడి లోపం ఉన్నవారికి కొత్తవి 50, రెన్యూవల్ 20, ఆర్థోపెడిక్ (శారీరకలోపం) సంబంధించి 11, 18, 21, 28తేదీల్లో కొత్తవి 50, రెన్యూవల్ 20, మానసిక రుగ్మతకు సంబంధించి 19న కొత్తవి 40, రెన్యూవల్ 10, కంటి లోపం 24న కొత్తవి 30, రెన్యూవల్ 10 స్లాట్ల బుకింగ్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక రోగులు సదరం క్యాంపులో దరఖాస్తులు చేసుకోకూడదని పేర్కొన్నారు. మీ-సేవలో నమోదు చేసుకుని అందుకు సంబంధించిన మెసేజ్ అందిన వారు మాత్రమే జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆధార్, రేషన్, ఓటర్ కార్డులతో పాటు వైద్యుని రిపోర్టులతో శిబిరంలో పాల్గొనాలని తెలిపారు. వైద్యులు పరీక్షించి వికలత్వ శాతాన్ని నిర్ధారించిన తర్వాత సదరం ధ్రువపత్రం అందజేయనున్నట్లు, అనివార్య కారణాలతో వైద్యుడు అందుబాటులో లేకుంటే క్యాంపు రద్దు చేయనున్నట్లు వెల్లడించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 5: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004-25 సంవత్సరానికి గాను వాక్-ఇన్-ప్రవేశాలు ఈ నెల 5 నుంచి 20 వరకు (8,10వ తరగతి ఉత్తీర్ణులైన) అర్హులైన దరఖాస్తులు చేసుకోవాలని, తర్వాత ఎంపిక చేసుకున్న ఐటీఐకి ఈ నెల 11 నుంచి 20 వరకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని కోరారు.

● ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌లో భాగంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు భువనగిరి ఐటీఐ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో జాబ్ పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 9వ తేదీన తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

అన్ని బస్తీల్లో మౌలిక వసతుల కల్పన: చైర్మన్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 5: పట్టణంలోని అన్ని బస్తీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మన వార్డుకు మన చైర్మన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన 27వ వార్డులో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతకు మునిసిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. కమిషనర్ పి.రామాంజల్‌రెడ్డి, కౌన్సిలర్ నజీమా నస్రిన్ సల్లాఉద్దీన్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 5: మునిసిపాలిటీలోన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించనున్నట్లు మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం చైర్మన్ రాజు కు బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు పి.శ్రీధర్ బాబు, ఆలె నాగరాజు, ముత్యాల భూపాల్‌రెడ్డి, డి.బిక్షమాచారి, ఆలె చిరంజీవి ఉన్నారు.

శిథిలమైన ఇళ్లలో నివసించొద్దు: కమిషనర్

మోత్కూరు, సెప్టెంబరు 5: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలో శిథిలమైన ఇళ్లల్లో నివసించరాదని మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ అన్నారు. గురువారం మునిసిపాలిటీ వీధుల్లో పర్యటించి, శిథిలమైన ఇళ్లను పరిశీలించి అందులో నివసిస్తున్న వారితో మాట్లాడారు. వర్షాలతో శిథిలమైన ఇళ్లు కూలితే ప్రాణనష్టం జరిగే ప్రమాదమున్నందున వాటిల్లో ఉండకుండా ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వారి ఇంటి గోడలపై హెచ్చరిక నోటీసులు రాయించారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

మోత్కూరు, సెప్టెంబరు 5: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తుందని మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని పొడిచేడు గ్రామంలో వ్యవసాయ అధికారులు నిర్వహించిన కుటుంబ నిర్ధారణ సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో వి.కీర్తి, ఏఈవోలు టి.గోపీనాథ్, ఎం.అశోక్‌కుమార్, ఎ.వేణు పాల్గొన్నారు.



రైతుల నుంచి రుణమాఫీ కోసం దరఖాస్తు స్వీకరిస్తున్న ఏవో కీర్తి

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 5: పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ శ్రీను కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం చౌటుప్పల్ పట్టణంలోని 10వ వార్డులో ఫౌండేషన్ ఆధ్వరంలో ఇంటింటికీ తిరిగి సుమారు 250 మట్టి వినాయక విగ్రహాలను శ్రీను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు అశోక్ కుమార్, హరి సిద్దయ్య, నవీన్ శంకర్, నందు, రఘు, సత్యనారాయణ, సురేష్, సాయి, పాపయ్య, వెంకటేష్, స్వామి పాల్గొన్నారు.

● చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి లో గల శివసేన యూత్ ఆధ్వర్యంలో భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. శివసేన యూత్ 19 వ వార్షికోత్సవం సందర్భంగా రూ. 1.95 లక్షలు వెచ్చించి 22 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని హైదరాబాద్ లోని కాటెదాన్‌లో ప్రత్యేకంగా తయారు చేయించారు.

అడ్డగూడూరు : వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీస్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్థానిక ఎస్ఐ డి.నాగరాజు ఉత్సవ కమిటీల నిర్వాహకులను కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

భువనగిరి రూరల్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని తహసీల్దార్ శ్రీధర్ యువజన సంఘాలకు సూచించారు. గురువారం బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా యువజన సంఘాలతో పోలీసు శాఖ నిర్వహించిన సమావేశానికి తహసీల్దార్‌తో పాటు భువనగిరి రూరల్ సీఐ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ రమేశ్, ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈశ్రీనివాస్ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా శుక్రవారం భువనగిరి మునిసిపాలిటీ భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ పి.రామాంజల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రిన్స్‌కార్నర్, ఇందిరానగర్, కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తారని తెలిపారు. భక్తులు మట్టి విగ్రహాలను స్వీకరించి ప్రతిష్టించి పూజించాలన్నారు.



చౌటుప్పల్‌లోని 10వ వార్డులో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మసనం లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ మసనం శ్రీను

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, సెప్టెంబర్ 5: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సప్లయ్, ఆరోగ్యశ్రీ పథకం పెంపువంటి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ ప్రాంత సాగునీటి కాల్వ, బునాదిగాని ధర్మారెడ్డి పిల్లాయిపల్లి కాల్వ ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభంకానున్నట్లు స్పష్టం చేశారు. తర్వాత ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల, ఇంటి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో పేదలను విస్మరించదన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పెండింగ్‌లో రిక్వెస్ట్ బస్టాండ్ పూర్తి చేయాలని బీబీనగర్‌లో కొనసాగుతున్న ఎస్సీ గురుకులం, వలిగొండకు మార్చాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 107 కల్యాణలక్ష్మీ, 1 షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ్‌రావు, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు సత్తిరెడ్డి, శ్రీనివాస్ అనంతరెడ్డి, యుగేందర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: భువనగిరి సింగన్నగూడెంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి లబ్ధిదారులు గురువారం వినతి పత్రం అందజేశారు. 444 మందికి ఇళ్ల కేటాయింపు జరిపి, సుమారు ఏడాది కావస్తున్నా మౌలిక వసతుల లేమి కారణంగా ఇళ్లను స్వాధీనం చేయలేదని, ఫలితంగా లబ్ధిదారులు అద్దె ఇళ్లలో జీవితం గడుపుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబాల సభ్యులు చేగూరి సుధాకర్, కొత్త సత్యం, బరిగె శంకర్, రచ్చ సాయికుమార్, శ్రీలత, మంజుల, పాశం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోత్కూరు : అక్రమంగా అరెస్టు చేసిన తెలంగాణ రాష్ట్ర డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను విడుదల చేయాలని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మోత్కూరు పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని మోత్కూరు సీడీపీవో జ్యోత్స్న కోరారు. పోషణ మాసం కార్యక్రమాలపై మోత్కూరు పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

● మోత్కూరు మునిసిపాలిటీలోని వైన్స్ దుకాణాల నుంచి పన్నులు వసూలు చేసేలా గెజిట్ నోటిఫికేషన్ కోసం మునిపిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మాణించాలని కోరుతూ పట్టణానికి చెందిన అవిశెట్టి యాదగిరి, వారాల రాకేష్ గురువారం కౌన్సిల్‌లో తీర్మాణం చేయించి కలెక్టర్‌కు పంపి, గెజిట్ నోటిఫికేషన్ వచ్చేలా చూడాలన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం జీవో 81ని సవరించి వివిధ శాఖల్లోకి వెళ్లిన, రిటైర్డు అయిన మాజీ వీఆర్ఏలకు న్యాయం చేయాలని పూర్వ వీఆర్ఏల సంఘం నాయకులు బోళ్ల సాయిలు, బత్తిని వెంకటేష్, గొడుగు బుచ్చయ్య తదితరులు కోరారు. గురువారం వారు మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను రద్దుచేసి సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఆలేరు రూరల్: భారీ వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు మాటూరి బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. ఆలేరులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.50వేల పంట నష్టాన్ని అందించాలన్నారు. నాయకులు దూపటి వెంకటేష్, జూకంటి పౌల్, తులసయ్య, గణేష్, రాములు నాయక్ ఉన్నారు.

మోటకొండూరు: గణేష్ మండలపాల వద్ద నిర్దేశించిన నిబంధనలు పాటించాలని తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో ఇందిరా, ఏఎస్ఐ రవికుమార్, అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు.

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక ఎంపీడీవో నవీన్‌కుమార్‌కు ఇటీవల ఉత్తమ సేవ అవార్డు లభించినందుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గురువారం పూలమాలలు, శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు చీర శ్రీశైలం, గంధమల్ల అశోక్, బాలరాజు గౌడ్, సైదాపురం మాజీ ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

భువనగిరి రూరల్: భువనగిరి మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా ఎన్ శోభారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ హాల్‌లో ఆమె మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

వలిగొండ: సర్వాయిపాపన్న పోరాటం స్ఫూర్తిదాయకమని ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి తెలిపారు. మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామంలో సర్వాయిపాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు.

● చిన్నారులు వయసుకు తగ్గ బరువు ఉండాలని శిశు సంక్షేమశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. గురువారం వలిగొండలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

రాజాపేట: రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను స్వీకరిస్తున్నామని వ్యవసాయశాఖ యాదగిరిగుట్ట ఏడీఏ శాంతి నిర్మల తెలిపారు. గురువారం మండలంలోని చల్లూరు, రాజాపేట గ్రామాల్లో రేషన్‌కార్డు లేని రుణమాఫీ నిల్చిపోయిన రైతుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు.

భూదాన్‌పోచంపల్లి : అన్ని వర్గాల ప్రజలకు ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు విశేష సేవలు అందిస్తోందని బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అన్నారు. పట్టణంలో బ్యాంకు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

బునాదిగాని కాల్వ పూర్తి చేసే వరకు ఉద్యమం

మోత్కూరు, సెప్టెంబరు 5: బునాదిగాని (ధర్మారం) కాల్వ నిర్మించి, ఈ ప్రాంతానికి సాగు నీరందించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటం నిర్వహిస్తామని మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల సాధన వేదిక జిల్లా కోకన్వీనర్ కల్లూరి మల్లేశం అన్నారు. బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తి చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న బైక్ ర్యాలీ కరపత్రాలను గురువారం మోత్కూరు అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 10న అడ్డగూడూరు మండలంలో బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, వలిగొండ, భువనగిరి, బీబీనగర్ మండలాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రాచకొండ రాములమ్మ, పైళ్ల యాదిరెడ్డి, కూరపాటి రాములు, మెతుకు అంజయ్య, కందుకూరి నర్సింహ, గుండు లక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

చేనేత సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 5: పట్టణంలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నిర్వహణ కార్యక్రమంలో గురువారం అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఈ మేరకు కార్మిక సంఘం అధ్యక్ష స్థానానికి ముసునూరి యాదగిరి, కర్నాటి పురుషోత్తం, సీత క్రిష్ణ, అంకం పాండు, ఏలె శ్రీనివాస్, కొంక లక్ష్మీనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు.